పద్మారావునగర్ పార్కు అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి

పద్మారావునగర్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో అతిపెద్దదైన పద్మారావునగర్ పార్కు సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన కార్యాచరణ, కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పద్మారావునగర్ పార్కు ఆవరణలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్కులో సౌకర్యాలు, సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో కంటే పద్మారావునగర్ పార్కుకు వాకర్స్, సందర్శకుల సంఖ్య పెరిగిందన్నారు. సనత్‌నగర్, సికింద్రాబాద్, ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పార్కుకు వస్తున్నారన్నారు. పార్కులో అహ్లాదకరమైన వాతావరణం, సౌకర్యాలతో పాటు యోగా, వాకింగ్, జిమ్ వంటి సదుపాయాలు ప్రజలకు, వాకర్స్‌కు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఉద్యావన శాఖ అధికారులు పార్కుపై మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జనవరి 1న పార్కులో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సమావేశం పలు తీర్మానాలు ఆమోదించింది. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు లాయక్, అజేయ్, కె. రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కుషాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా దానంతో జీవితాంతం సంతృప్తి



కార్యక్రమంలో పాల్గొన్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ వాణీదేవి, వెల్లాల రామ్మోహన్ తదితరులు

సనత్‌నగర్: విద్యా దానం ద్వారా జీవితాంతం సంతృప్తిని అందించవచ్చని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్‌ఎస్‌ఎస్) తెలంగాణ ఆధ్వర్యంలో 120 మంది పేద బ్రాహ్మణ విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు, మరో 50 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. సమాఖ్య అధ్యక్షులు వెల్లాల రామ్మోహన్ అధ్యక్షతన ఆదివారం సనత్ నగర్‌లోని హనుమాన్ దేవస్థానం కళా వేదిక ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వామిజీ మాట్లాడారు. భగవంతుడు మనకిచ్చిన దానిలో ఎంతోకొంత సమాజహితానికి వినియోగించాలన్నారు. దానం తీసుకునేవారు సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆ దానానికి సార్థకత ఉంటుందన్నారు. వెల్లాల రామ్మోహన్ తన సొంత ఖర్చుతో 120 మందికి ల్యాప్‌ట్యాప్‌లతో పాటు 50 మందికి స్కాలర్‌షిప్పులు అందజేయడం అభినందనీయమన్నారు. బీఎస్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ సమాఖ్య తరుపున భవిష్యత్తులో విభిన్న కార్యక్రమాలను చేపడుతూ బ్రాహ్మణులకు చేయూతనందిస్తామన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుధాకర్

బౌద్ధనగర్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని వారాసిగూడ ఎస్‌ఐ సుధాకర్ అన్నారు. ఆదివారం న్యూ అశోక్‌నగర్‌లో పార్శిగుట్ట అర్బన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో అశోక్ నగర్ పోచమ్మ, మైసమ్మ దేవాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సుధాకర్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బస్తీలతో పాటు దేవాలయాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు పిట్టల ఓం ప్రకాష్, వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

హక్కుల కోసం సంఘటితంగా ఉద్యమించాలి



కార్యక్రమంలో అభివాదం చేస్తున్న నాయకులు

బన్సీలాల్‌పేట్: మాదిగలు తమ హక్కుల కోసం సంఘటితంగా ఉద్యమించాలని సనత్‌నగర్ మాదిగ హక్కుల పోరాట సంఘం పిలుపునిచ్చింది. బన్సీలాల్‌పేట్‌లో ఆదివారం సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మాదిగలు అభివృద్ధి ఫలాల విషయంలో తీవ్ర వివక్షకు గురవుతున్నారన్నారు. మాదిగలను సంఘటితం చేస్తూ రాజకీయ శక్తిగా, అన్ని విధాలా ఎదగడానికి సనత్‌నగర్ నియోజకవర్గంలో సంఘాన్ని మరింత విస్తరించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ మాదిగ హక్కుల పోరాట సంఘం కన్వీనర్ కుర్మ బలరామ్, కో-కన్వీనర్లు ఏసూరి శ్రీనివాస్, దేశపాక గోవర్ధన్, బండారి శివ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కాలర్‌షిప్ కార్యక్రమం ప్రారంభం



ఇంటిగ్రేటెడ్ స్కాలర్‌షిప్ ప్రారంభ కార్యక్రమంలో రుద్రకుమార్‌శర్మ, జవహర్‌రెడ్డి తదితరులు

సనత్‌నగర్: బెంగుళూరుకు చెందిన జైన్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ (జేఐఆర్‌ఎస్) భారతదేశపు మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని బేగంపేటలోని చిరాన్‌పోర్ట్ క్లబ్‌లో ప్రారంభించారు. జేఐఆర్‌ఎస్ సీఓఓ రుద్రకుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐబీడీపీ అధిపతి గోపాల్‌రాజ్, ఏపీ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ సీనియర్ కోచ్ అనిల్‌కుమార్, క్రీడా విశ్లేషకులు మహ్మద్ మక్దూమ్ అహ్మద్, బ్యాడ్మింటన్ కోచ్ ధను ఉతోమో తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఐఆర్‌ఎస్ సీఓఓ రుద్రకుమార్‌శర్మ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి చదువులోనూ, క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచే 1 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు జేఐఆర్‌ఎస్ పాఠశాలలో ప్రవేశం కల్పించి ఉపకార వేతనంతో కూడిన విద్యనందిస్తామన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి



కార్యక్రమంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

పంజగుట్ట: రాబోయే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంపై చర్చించి సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సుమారు 30 ప్రభుత్వ, ప్రభుత్వరంగ శాఖల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘాల యూనియన్ ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ఒకే వేదికపై వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు, డిమాండ్లు సాధించుకునేందుకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు పులి లక్ష్మయ్య, నరసింహ, ఈశ్వర్ రావులు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో చైతన్యం కల్పించేందుకు త్వరలోనే జిల్లా, మండల స్థాయి కమిటీలు వేయాలని తెలిపారు. ఏజెన్సీ విధానం రద్దు, గ్రూప్ 4 నియామకాల ద్వారా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణారెడ్డి, దుర్గం శ్రీనివాస్, యాదగిరి, శంకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనభోజన మహోత్సవాలు





సనత్‌నగర్ పార్కులో ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి తదితరులు



కార్యక్రమంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



సనత్‌నగర్: కార్తీక వనభో'జన' మహోత్సవాలతో సనత్‌నగర్ ప్రాంతంలోని ఉద్యాన వనాలు మురిసిపోయాయి. పవిత్ర కార్తీక మాసంలో ఉసిరి, మారేడు, తులసి తదితర మొక్కల నుంచి వెలువడే పరిమళాల నడుమ రోజంతా సందడిగా ఆడిపాడారు. తోటి వారితో కలిసి వినోదాల జల్లులు కురిపించారు. చిన్నా పెద్దా, మహిళలు...ఇలా అందరూ ఒకచోట చేరి ఆహ్లాదకర వాతావరణంలో సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ తమ కాలనీవాసులతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆట పాటలతో కొత్త అనుభూతులను ఆస్వాదించారు. రోజంతా ఆనందంగా గడిపి మరుపురాని జ్ఞాపకాలను మూటగట్టుకున్నారు. సనత్‌నగర్ ప్రాంతంలో ఆదివారం పలుచోట్ల కార్తీక వనభోజనాలు జరిగాయి.

సనత్‌నగర్ గ్రీన్‌పార్కు-2లో..

ఎస్‌ఆర్‌టీ గ్రీన్ పార్కు-2లో స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కార్తీక మాస వన మహోత్సవం ఘనంగా జరిగింది. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై పార్కులోని ఉసిరి, తులసి చెట్టుకు పూజలు నిర్వహించి వన భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్‌ఆర్‌టీ కాలనీవాసులతో పాటు వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన ప్రజలు వనభోజన మహోత్సంలో పాల్గొని సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రీన్ పార్కు-2 ప్రతినిధులు ప్రభాకర్, సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, గోపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రమేష్, శ్రీను, గోవిందరావు, రాజులతో పాటు పద్మ, పుష్పలత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌కాలనీలో..

మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉద్యానవనంలో జరిగిన కార్తీక వనభోజన మహోత్సవంలో కాలనీవాసులు పాల్గొన్నారు. పిల్లలకు, మహిళలకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. సాయంత్రం వరకు తమ తమ కాలనీవాసులతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆట పాటలతో కొత్త అనుభూతులను ఆస్వాదించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, కోశాధికారి శశికాంత్, నాగమణి, సుందర్‌నగర్ అధ్యక్షుడు మాచారావు పాల్గొన్నారు.

అమీర్‌పేట: నవవనాల మున్సిపల్ పార్కులో పద్మశాలీయుల కార్తీక మాస వన భోజనాలు ఉత్సాహంగా జరిగాయి. మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వన భోజనాలకు సనత్ నగర్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. ఉదయం వైదిక యజ్ఞం, శివాభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంఘం అసోసియేషన్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి

లాలాపేట: ఇటీవల ఎన్నికల ఫలితాలను సమీక్షించుకుని కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు, భారతదేశాన్ని కాపాడేందుకు ఉద్యమించాలని సమాజ్ వాది పార్టీ (ఎస్పీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సింహాద్రి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ నాయకత్వంలో ఉత్తర ప్రదేశ్‌లో ముఖాముఖీ పోటీపడి రెండు స్థానాల్లో విజయం సాధించిందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ఓల్డ్‌సీఐబీ క్వార్టర్స్ బ్రెట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో అధ్యక్షుడిగా వెల్లూర్ గోపీనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గిల్ల గోపాల్, కోశాధికారిగా వివ రాఘవేంద్ర ప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ బ్రెట్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని, స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి

లిబర్టీ: పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టకపోతే బీసీలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. ఆదివారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీ నుంచి పార్లమెంటు ఉభయ సభలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఉందన్నారు. రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని అనేక సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా బీసీలు వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నప్పటికీ అధికారంలో ఉన్న పాలకులు బిల్లుకు ఆమోదముద్ర వేయలేక పోయిందని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం చట్టసభల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టకపోతే గల్లీస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు సమరశంఖం పూరిస్తారని ఆయన హెచ్చరించారు.

మాలల సత్తా చూపాలి

పంజగుట్ట: డిసెంబర్ 1వ తేదీన జింఖానా గ్రౌండ్స్‌లో జరగనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేసి మాలల సత్తా చూపాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి. చెన్నయ్య కోరారు. ఆదివారం బాలాపూర బస్తీలో సింహగర్జన పోస్టర్‌ను రాజు ఉస్తాద్, పత్తి ప్రవీణ్, రావుల విజయ్ కుమార్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఐక్యంగా ఉండడం చూసి ఓర్వలేని కొన్ని రాజకీయ పార్టీలు దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు చూస్తున్నారన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు సుప్రీంకోర్టు ధర్మాసనంలో ఎస్సీ వర్గీకరణకు చేసుకోవచ్చునని తీర్పు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. అంబేద్కర్ వారసులుగా రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, రిజర్వేషన్లు కాపాడుకోవడం ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.

ఓయూలో ఘనంగా ఎన్‌సీసీ డే



ఆర్ట్స్ కాలేజీ ఎన్‌సీసీడే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఎన్‌సీసీ డేను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్‌సీసీ గేటు వరకు 5 కేరన్ నిర్వహించారు. ప్రతి ఏటా నాల్గవ ఆదివారం దేశ వ్యాప్తంగా ఎన్‌సీసీ డేను నిర్వహిస్తారని లెఫ్టినెంట్ ఎన్‌సీసీ ఆఫీసర్ డా.పల్లా నరేష్ పేర్కొన్నారు. ఎన్‌సీసీలో 15 లక్షల మంది విద్యార్థులు సేవలందిస్తున్నారన్నారు.

రసూల్‌పురా: ఎన్‌సీసీ కేడెట్లలో అంకితభావం, క్రమశిక్షణ, దేశభక్తి ప్రతిబింబిస్తుందని తెలంగాణ, ఆంధ్ర ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి పేర్కొన్నారు. మెహదిపట్నం గ్యారిసన్ గ్రౌండ్స్‌లో ఎన్‌సీసీ 76వ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్ల కవాతు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు. ఆశ్వ ప్రదర్శన, సాంప్రదాయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన కేడేట్లను అవార్డులు బహూకరించారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



శ్రీనివాస్‌కు క్రియాశీలక సభ్యత్వం అందజేస్తున్న శ్యాంసుందర్ గౌడ్, రాజశేఖర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మహంకాళి జిల్లా అధ్యక్షులు కె. శ్యాంసుందర్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ టి. రాజశేఖరరెడ్డి అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్ ముదిరాజ్, ఎం. శ్రీనివాస్ తదితరులకు పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కె. శ్యాంసుందర్ గౌడ్, టి. రాజశేఖరరెడ్డిలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకలు ప్రజలు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందే విధంగా నాయకులు, కార్యకర్తలు చూడాలన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో 12వేల సాధారణ సభ్యత్వం, 75 మంది క్రియాశీలక సభ్యత్వాలను తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్. రాజు, కె. క్రిష్ణ, ఎ. శ్రీనివాస్, పరమేష్, కిరణ్, మహేష్, ఎం. శ్రీనివాస్, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్‌కు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు

రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్



వేడుకలను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ తదితరులు

ఖైరతాబాద్: ఆక్యుపంక్చర్ విధానానికి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందని రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆక్యుపంక్చర్ డే వేడుకలను ఆదివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ ఆక్యుపంక్చర్ ఆక్యుప్రెషర్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కె.లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చికిత్సలు అందించే విధానం ఆక్యుపంక్చర్‌కు ఉందన్నారు. ఈ విధానంపై ఉన్న అపోహలు తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ తెలిపారు. అల్లోపతి విధానంలో కంటే అద్భుతంగా ఈ విధానంలో చికిత్సలు అందించవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ చికిత్సల విధానాన్ని గుర్తించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి దీన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకొని కౌన్సిల్ ఏర్పాటుతో పాటు ఆక్యుపంక్చర్‌ని వైద్య విధానంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన ప్రాక్టీషనర్లకు చికిత్స పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఎస్.సాగర్, కోశాధికారి జి.సుభాష్‌లతో పాటు ఆక్యుపంక్చర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఈఎస్‌ఐ, కుందన్‌బాగ్, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్యామలకుంట పార్కు, బీకే గూడ, మున్సిపల్ పార్కు, ఈఎస్‌ఐ వెనుక వైపు, బీఎస్ మక్తా, హుస్సేన్‌నగర్, నిషాంత్‌బాగ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, సుభానీ మసీదు ఏరియా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జెకెకాలనీ, బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు, సెయింట్ థెరిస్సా హాస్పటల్, శాంతి శిఖర అపార్ట్‌మెంట్స్, కుందన్‌బాగ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.31, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 35, బెండకాయ 28, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 20, పందిరి బీర 38, క్యాబేజీ 23, క్యారెట్ 55, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 35, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



అమీర్‌పేట: కార్తీక మాసం సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదివారం ఉదయం నుండే ఆలయం వద్ద భక్తుల తాకిడి కనిపించింది. గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: అన్నానగర్ చౌరస్తా లోని శ్రీ పోచమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో ఆదివారం 54 హోమగుండాలతో అర్చకులు అచ్యుతశర్మ ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా సుదర్శన హోమం, శ్రీనివాస కల్యాణం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు టీఎన్. శ్రీనివాస్, డి. శ్రీనివాస్, బీజేపీ నాయకులు శ్రీనివాస్, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టండి



జాజుల లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: పార్లమెంట్ శాతాకాల సమావేశంలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా బీసీల న్యాయమైన డిమాండ్లను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మెజారిటీ జనాభ గల బీసీల మనోభావాలను గౌరవించి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

డిసెంబర్ 1న వన భోజనాలు



గడ్డిబస్తీలో సమావేశంలో పాల్గొన్న మాదిగ సంఘాల నాయకులు

రసూల్‌పురా: డిసెంబర్ 1న వనభోజనాలు ఏర్పాటు చేసి మాదిగల ఐక్యతను చాటనున్నట్లు ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నాయకులు దుబ్బ మురళి తెలిపారు. రిసాలబజార్ గడ్డిబస్తీలో ఆదివారం కంటోన్మెంట్ మాదిగ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ అన్న దమ్ముల మంటూనే మాదిగలకు వెన్నుపోటు పొడిచే విధంగా మాలలు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నవీన్. చిన్నా, ఉమేష్, ఈఆర్, రాజు, సుధాకర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ నుంచి లాలాగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం మధ్యలోని పట్టాలపై ఈ నెల 23న సాయంత్రం సుమారు 50-55 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు.

బ్యాటరీ ట్రాలీ బోల్తా పడి డ్రైవర్ మృతి

సికింద్రాబాద్: బ్యాటరీ ట్రాలీ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కుర్మ రాములు(54) వస్తువులు తరలించే బ్యాటరీ ట్రాలీని నడుపుతుంటాడు. ఆదివారం తెల్లవారుజామున రైల్వే స్టేషన్ 7వ నెంబర్ ప్లాట్ ఫాంపై రాములు బ్యాటరీ ట్రాలీలో సామగ్రిని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు బండి అదుపుతప్పి ప్లాట్ ఫాం పై నుంచి రైల్వే ట్రాక్‌పై పడింది. దీంతో వాహనం కింద ఇరుక్కుపోయిన రాములు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.